# ఆకర్షణ వెనుక

ఇష్టం లేకుండా ప్రయాణం చేయవలసిరావటం అంత కష్టం మరేదీ వుండదు. ఈ రోజు ప్రయాణం కావటం నా కిష్టంలేదు. అయితే అమ్మా నాన్నా రాసిన అల్టిమేటమ్ లాంటి ఉత్తరం నన్ను ప్రయాణానికి సిద్ధం చేసింది. ఆఫీసర్‌ని బ్రతిమలాడి రెండు రోజులు సెలవు సంపాదించాను. శని ఆదివారాలు కలుపుకుంటే నాలుగు రోజులు సెలవు.

మధ్యాహ్నమే భోజనం చేయడంవల్ల, ఆఫీసు రెండింటికి అయిపోగానే నేరుగా రూమ్‌కి వచ్చి అలాగే అదే రిక్షాలో బయలుదేరి మూడుగంటల బస్సు పట్టేశాను. ఎంత, రెండు గంటల ప్రయాణం – అక్కడనుంచి పదినిమిషాలు నడిస్తే మా వూరు. కాలవగట్టంట చెట్లనీడలో నడక అలసిన శరీరానికి విశ్రాంతే యిస్తుంది.

'మీ చేతిలో పత్రిక యిస్తారా ?'

సీరియల్ చదువుదామని స్టాండులో పత్రిక కొన్నాను. పత్రికయితే తెరిచాను కానీ, చదవటం లేదు. సీటు పక్కనున్న వ్యక్తి అది గమనించి అడిగేడు.

'పత్రిక కొని చదివే అలవాటు – ఆ ఆర్థిక స్థాయి మనవాళ్లకి ఎప్పుడొస్తాయో' అనుకుని యిచ్చేశాను.

బస్సు వేగంగా వెళుతోంది. అది ఫాస్టు పాసెంజర్.

ఎందుకో తలెత్తి ముందుకి చూశాను.

నా పక్కవరసలో ఆడవాళ్ల సీట్లో ఓ అమ్మాయి కూర్చునుంది. సిగముడి వేసింది. ఆ బర్మీస్‌ముడి, ఆ కేశసంపద నా మనస్సుని తక్కున ఆకట్టేసుకున్నాయి.

'ఎంత అందంగా వుంది !' అనుకున్నాను. పాలరాతి శిల్పానికిమల్లే వున్నమెడ, ఆ మెడమీద వున్న ఒంటిపేర బంగారు గొలుసు అందంతో పోటీ పడుతున్నాయి.

అందమైన వస్తువుల్ని చూడటంలో తప్పు లేదు. ఇది నా ఉద్దేశ్యం కాదు. నా ఫ్రెండ్ శర్మ అభిప్రాయం. నేనెప్పుడూ అతని అభిప్రాయంతో ఏకీభవించలేదు.

కాని వాడి అభిప్రాయాన్ని యిప్పుడు ఒప్పు



కోక తప్పులేదు అవును! అందంగావున్న ఆడ వాళ్ళని ఆరాధనా పూర్వకంగా చూస్తే తప్పేమిటి?

దురుద్దేశ్యం ఎంతమాత్రం లేదు నాలో! అందుకే అలాగే ఆమెవైపే చూస్తూ వుండి పోయాను

సుమారు యిరవయ్యేళ్ళలోపే వుంటుంది వయస్సు ఆరోగ్యమైన శరీరం అందంగా వుంది బస్సులో యితర్లు గమనిస్తున్నారా లేదా' అనేది కూడా గమనించకుండా చూస్తున్నాను

కొద్దిగా తల తిప్పింది ఆ అమ్మాయి. నిండుబుగ్గలు గులాబీ రంగులో! శిల్ప మలిచి నట్టుగా వున్న నాసిక — ఎర్రని పెదాలు, మొనతేలిన గడ్డం! ఒక్కసారి చూస్తే జన్మలో మరిచిపో లేనంత అందం పోతపోశాడు బ్రహ్మ!

నా కళ్ళు అయస్కాంతానికి యినుములాగే అతుక్కుపోయాయి ఆమెకే — నా అదృష్టం పండిందేమో! ఎందుకో ఆమె తల తిప్పింది.

కూలింగ్ గ్లాస్ వేసుకుని దర్జాగా ఆఫీసర్ మల్లే వుంది! ఎంత ఠీవి! ఎంత దర్పం!

బాపిరాజు బొమ్మను చూసో, విశ్వనాథ నవల చదివో, శేషేన్ గేయం వినో తృప్తిగా నిట్టూర్చి నట్టు నిట్టూర్చేను మ్యూజియంలో వుండే పాలరాతి శిల్పంలా వుంది!

ఇంత అందాన్ని స్వంతం చేసుకున్న ఆ ధన్యుడెవడో— అతన్ని అభినందించాలనిపించింది.

అయినా యిది తెలుగు దేశం! అమెరికా కాదు. అందాన్ని పొగిడితే ఆడవాళ్లే అపార్థం చేసుకుంటారు ఇక భర్త అయిన మగవాడు కుళ్ళుకోడూ?

మరోసారి చూశానామెని!

ఆమె మెళ్ళో మంగళసూత్రాలు లేవు!

ఎందుకో నా మనస్సు బరువుగా నిట్టూర్చింది నేను దీర్ఘంగా వూపిరి పీల్చుకున్నాను.

బస్సు కుదుపుతో ఆగింది! అంతదనుకా నేను ఆమెని బాగా చూడటానికి అడ్డంగా వున్న ముసలావిడ ఆ స్టేజిలో దిగిపోయింది

'అమ్మయ్య!' అనుకున్నాను

తెరపై అభిమాన నాయిక అందాన్ని ఆరాధనా పూర్వకంగా చూసినట్టు చూస్తున్న నా మనస్సులో ఓ ఊహ హఠాత్తుగా కదిలింది. ఆ ఊహ పాము పిల్లలా జరజర లాడింది.

''నేనీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే!?'' అదీ నా మనస్సులో మెదిలిన మధురోహ.

అవును!

నాకేం తక్కువ?

జిల్లా కేంద్రంలో కలెక్టరాఫీసులో డిప్యూటీ తహసీలుదారుగా పనిచేస్తున్నాను ఎం ఏ. పాసయ్యాను ఆస్తి వుంది. మా తాత తండ్రులు సంపాదించిన కీర్తి వుంది. సంప్రదాయం వుంది.

కులం — గిలం నా మాటల్లో విలువ్వ. మతం పెద్ద అడ్డంకి కాదు నాకు—అయినా ఆ అమ్మాయి హిందువేనన్నట్టుగా ముఖాన వున్న నిలువుబొట్టు చెపుతోంది

మరింకేం?

ఎవరో నా మనస్సుని చరిచినట్టైంది.

''మూర్ఖుడా! ఆ అమ్మాయి నీకు నచ్చింది. కులం నీకు అభ్యంతరంకాదు — కానీ నువ్వా అమ్మాయికి నచ్చొద్దూ?'' అన్నట్టైంది.

ఉలిక్కిపడ్డాను

అంతలో మళ్ళీ నన్ను నేను సమర్థించు కున్నాను.

''పెళ్ళి చూపులు యింతకంటే జరుగు తాయా? అసలు నేను యింత హఠాత్తుగా సెలవు పెట్టి బయల దేరింది అందుకేకదా? ఈ అమ్మాయి విషయం చెపితే అమ్మా నాన్నా కూడా కాదనకపోవచ్చు — పోవచ్చేమిటి? కాదనరు. ఎలా గయినా కోడలు యింటికి రావటం వాళ్ళకిముఖ్యం— ఈ రెండుమూడేళ్ళుగా పెళ్ళంటే 'ఉహూ' అంటూ వాయిదా వేస్తున్న నేను ఓ అమ్మాయిని యిష్ట పడ్డాను అంటే ఆనందంగా ఆశీర్వదిస్తారు?''

నా ఆలోచనల్లో నేను పెళ్ళికొడుకునై పోతు న్నాను నా తరువాత అన్నీ సమర్థించుకుంటున్నాను

అంతలో బస్సు ఆగింది. అది జంక్షన్. అక్కడ బస్సు పది నిమిషాలు ఆగుతుంది. కాఫీ తాగొచ్చు

పత్రిక తీసుకున్న పక్కసీటు మనిషిని బ్యాగ్ చూస్తూ వుండమని చెప్పి బస్సు దిగాను.

నేను దిగిన ఓ నిమిషానికి ఆ అమ్మాయి కూడా ఓ నడివయస్సు వ్యక్తితో దిగింది.

ఆమె స్వయంగా దిగలేకపోయింది!

కారణం ఆమె రెండు కాళ్ళూ చచ్చుపడి పోయాయి ''ఛీ! భగవంతుడు ఎంత దుర్మా ర్గుడు!'' చేదుతాగిన మనస్సుతో తిట్టుకున్నాను.

ఆవ్యక్తి వీణవున్న పెట్టెని క్రిందికి దింపించి ఆమె దగ్గరికి వచ్చాడు రిక్షావాళ్ళు చుట్టూ ముట్టారతన్ని.

నేనూ దగ్గరిగా వెళ్ళాను.

''నమస్కారం మేష్టారూ!'' అన్నాను.

'నమస్తే!' క్లుప్తంగా అన్నాడావ్యక్తి.

'ఆమెకి కాళ్ళు ఎలా పోయాయో చెపుతారా?'

'ఏమిటి నీ యింటరెస్ట్?' అన్నట్టుగా చూశాడు. ఓ క్షణం ఆగి 'ఈ అమ్మాయి నా కూతురు చంద్రశిల్ప! అద్భుతంగా నాట్యం చేసేది—భువనమోహనంగా నాట్యంచేస్తూ పాడేది ఓసారి మలేరియా వచ్చింది అందం, చందం, చదువు, సంస్కారం, కళాకౌశలం అన్నీ యిచ్చిన భగవంతుడు తనకై తానే కాళ్ళు తీసేసుకున్నాడు. ఆనాటినుంచీ నాట్యం మానేసింది! యిలా సంగీత కచేరీలు చేస్తూ వుంది!' భారంగా అన్నాడాయన.

నా మనస్సు విలవిలలాడింది.

'అయ్యో! పాపం!' అన్నాను.

''దేవుడు దయామయుడంటారు!'' ఆ వ్యక్తి యింకేదో చెప్పబోయాడు.

నేను అడ్డు తగులుతూ 'అవునండీ! అందుకే ఆమెకు ఆ అద్భుతమైన గొంతు, సంగీతంలో ప్రావీణ్యం యిచ్చాడు!' అన్నాను.


ఆయన నిరాశగా నవ్వాడు.

'మీకు అలాగే అనిపిస్తుంది! కాళ్ళు తీసేసు కున్నాడు. ఫరవాలేదు? మరి కళ్ళేం చేశాయి బాబూ? అర్థాంతరంగా చూపు పోవటానికి కారణ మేమిటి? నా బిడ్డ ఏం పాపం చేసుకుందని యిూ శిక్ష విధించాడు? జీవితంలో అంతో యింతో సుఖ సౌఖ్యాలు అనుభవించిన నా కళ్ళు తీసుకో కూడదూ? నా కాళ్ళు విరగ్గొట్టకూడదూ? ఒక్కగానొక్క బిడ్డ యిూమె! ఈమె యీ దుస్థితి చూసి మేం ఎలా నిబ్బరంగా వుండగలం? ఇవ్వాళైతే నేను వున్నాను. నా తర్వాత యిూమె గతి ఏమిటి?

బాగున్నప్పుడు రోజూ వెంటతిరిగిన యువకులు ఒక్కరూ ముందుకి రాలేదు, మూడు ముళ్ళూ వేయటానికి. అది వాళ్ళ తప్పుకాదు నేను. నా బిడ్డ దురదృష్టం. అంతే!'

విషయం విన్న నేను నిర్ఘాంతపోయాను. ఎంత భ్రమ! అంతటి సౌందర్యం వెనుక ఎంతటి విషాదం వుంది?

బస్సు హారన్ మ్రోగింది. కండక్టరు ఎక్కాడు. అతనికేమీ సమాధానం చెప్పకుండా నేనూ బస్సు ఎక్కాను.



బస్సు కదిలింది. నా ఊహలూ కదిలాయి.

'ఎంతలో ఎంత మార్పు! కొద్ది నిమిషాల క్రితం ఆమెని పెళ్ళి చేసుకోటానికి నా మనస్సు ఉవ్విళ్ళూరింది. ఆ అందగత్తె నా భార్య అయితే చాలనుకున్నాను.

ఇప్పుడు? నా మనస్సులో జాలి వుంది! అంతే!'

నా మనస్సుని వితర్కించుకోటానికి నాకే సిగ్గేసింది. ఆలోచనలని పారద్రోలి పత్రిక అందుకున్నాను చదవటానికి. ●

